మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

- చంద్రబాబుది హామీలు ఎగ్గొట్టే నైజం
- ఇచ్చిన హామీలతో పాటు అంతకుమించి పథకాలు అందించిన ఘనత జగనన్నది
- వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు రూరల్:

ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను ఎగ్గొట్టే నైజంతో మోసానికే చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర డాక్టర్ సెల్ అధ్యక్షులు సీదిరి అప్పలరాజు విమర్శించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై వజ్రపుకొత్తూరులో శుక్రవారం పార్టీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు గుర్తు చేసి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. చంద్రబాబు అండ్ కో చేసిన మోసాలను ప్రజలకు 'సాక్షి టీవీ'తెలియజేస్తుందనే భయంతో కెబుల్ నెట్‌వర్క్‌లో ప్రచారాలను నిలుపుదల చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేయడానికి రచ్చబండ కార్యక్రమాల నిర్వహణతో పాటు చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను ఆయుధంగా వినియోగించాలని సూచించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులు సోషల్ మీడియా వేదికగా చంద్రబాబు మోసాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని సంక్షేమ పథకాలు అందించడం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. రైతు భరోసా, జగనన్న విద్యా కానుక, గోరు ముద్ద, అమ్మవడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, చేదోడు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ బీమా, ఆరోగ్యశ్రీ, ఇంటింటికీ వైద్యం,



ఎన్నికల హామీలు తెలియజేసే క్యూఆర్ కోడ్ పత్రాన్ని చూపిస్తున్న నాయకులు

ఇంటి వద్దకే రేషన్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసే ఘనత జగన్‌కు దక్కిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో వేలాది ఉద్యోగాలు కల్పించారన్నారు. అలాగే వలంటీర్, రేషన్, మద్యం షాపుల నిర్వహణ కోసం లక్షలాది మంది నిరుద్యోగ యువతికి ఉపాధి అవకాశాలు కల్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలతో పాటు ఆస్పత్రులు నిర్మించారన్నారు. కిడ్నీ బాధిత గ్రామాలకు మంచినీరు అందించేందుకు రూ.700 కోట్లతో మంచినీరు, పలాసలో రూ. 50 కోట్లతో కిడ్నీ రిసెర్చ్ కేంద్రంతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్ పోర్టు లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు.

చంద్రబాబుది హామీలను ఎగ్గొట్టే నైజం

అధికారం కోసం హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎగ్గొంటే నైజం చంద్రబాబుదని అప్పలరాజు అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చినప్పటికీ వాటిని నేరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రూ. ఐదు లక్షల కోట్లు అప్పు చేస్తే.. కూటమి ప్రభుత్వం కేవలం ఒక్క ఏడాదిలోనే రూ. 1.84 లక్షల కోట్లు అప్పు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని చెబుతునే లక్షల కోట్ల రూపాయలు అప్పు తీసుకురావడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. పీ–4 కార్యక్రమంతో పేదవాడి ఆత్మగౌరవాన్ని ధనవంతులకు తాకట్టు పెట్టే అధునాతన స్కీంకు తెరలేపే సంస్కృతి చంద్రబాబుకే దక్కిందని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నెత్తున భారం మోపారన్నారు. అలాగే కొంతమందికే తల్లికి వందనం చెల్లించారన్నారు. పలాస నియోజకవర్గంలో గౌతు కుటుంబం 60 ఏళ్లు పాలించి ఈ ప్రాంతాన్ని నాశనం చేశారన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే అది కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలోనే జరిగిందన్నారు. అభివృద్ధి కోసం మాట్లాడే అర్హత గౌతు కుటుంబానికి లేదని అన్నారు. కాగా రెడ్ బుక్‌తో ప్రజలు, నాయకులపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదని, ఇంకా న్యాయం బతికే ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తిర్రి రాజారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంవో పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు దొర, ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ మాజీ అధ్యక్షులు పుక్కళ్ల గురయ్యనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, మహిళ అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, నూతనంగా నియామకమైన వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు,సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ్మినాన శాంతారావు, బమ్మిడి మోహన్‌రావు, లండ రామలింగం, నర్తు ప్రేమ్‌కుమార్, నర్తు శేషయ్య, ఇరోతు హేమంత్, దొంక విద్యాసాగర్, గూడ ఈశ్వరరావు, పిట్ట గీతారాణి, వడ్డి సరిత, సుశీల, జోగి అప్పారావు, మద్దిల హరినారాయణ, కొర్రాయి గోపి, ఉప్పాడ అనంద్, మామిడి భాస్కరరావు, చింత హేమారావు, దున్న బాలరాజు, విశ్వనాథం, హెచ్.బాలక్రిష్ణ, పలాస మండల సీనియర్ నాయకులు పైల చిట్టి, బత్తిని హేమేశ్వరరావు, బమ్మిడి దుర్యోధన పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మోసం చేయడం బాబు నైజం

- కూటమి సర్కార్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- వైఎస్సార్‌సీపీ సంతబొమ్మాళి మండల విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, పేరాడ తిలక్, తదితరులు

సంతబొమ్మాళి:

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దండుగోపాలపురంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'పై శుక్రవారం జరిగిన మండల విస్తృతస్థాయి సమావేశంలో నేతలు మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అలాగే పార్టీలో గ్రామస్థాయిలో నియమితులైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, పార్టీ నాయకులు రెయ్యి ప్రసాద్‌రెడ్డి, మేరుగు అప్పారావు, మార్పు నాగభూషణరావు, సుగ్గు రామిరెడ్డి, నక్క భీమారావు, మార్పు అశోక్‌చక్రవర్తి, ఎన్ని మన్మథరావు, పొందల రామకృష్ణ, జోగి రాములమ్మ, కోత సతీష్, సురాడ రాజారావు, సూరాడ వెంకటేష్, జీరు బాబూరావు, అంగ జనార్దన్, ఉప్పాడ లోకనాథం, నక్కెట్ల నరేష్, అట్టాడ అప్పలనాయుడు, బి.సుధాకర్, అంగ అప్పారావు, వాడరేవు రవి, చింతల రాజులు, అన్నెపు రామారావు పాల్గొన్నారు.

బడ్జెట్ తెలియకుండా హామీలా?



సుదీర్ఘ రాజకీయ అనుభవం, మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబుకు రాష్ట్ర బడ్జెట్ తెలియకుండా ఎన్నికల్లో హామీలు ఇచ్చారా? ఎన్నికల సమయంలో అమలుకాని హామీలిచ్చి అధికారాన్ని చేపట్టిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసగించారు. 50 ఏళ్లకు పింఛన్, మహిళలకు నెలకు రూ.15 వందలు ఇస్తామని చెప్పి వాటిని మరిచిపోయారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను వంచించారు. చంద్రబాబు మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టాలి. రెండుసార్లు అచ్చెన్నాయుడును ఓడించిన ఘనత, జెడ్పీటీసీ ఎన్నికల్లో 14 వేలు మెజార్టీ ఇచ్చిన ఘనత మీదే. కార్యకర్తల సమిష్ట కృషికి ఈ నిదర్శనం. మళ్లీ అదే ఊపు కొనసాగించాలి. టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పేరాడ తిలకేనని ఇందులో ఎటువంటి మార్పు ఉండదు.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



ప్రమాణ స్వీకారం చేస్తున్న గ్రామ కమిటి ఇన్‌చార్జీలు

ప్రజల తరఫున పోరాటం చేయాలి



చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి తరఫున గట్టిగా పోరాటం చేయాలి. అధికార పార్టీ నుంచి ఎంత ఒత్తిడి ఉన్నా ప్రజల పక్షాన నిలబడాలి. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలి. కాకరాపల్లి థర్మల్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో పాల్గొని ఈప్రాంత ప్రజల ఆదరాభిమానులను పొందగలిగాను. ప్రతి కార్యకర్తకు అండగా మేము ఉంటాం.

–తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త

ప్రతి పంచాయతీని చాలెంజ్‌గా తీసుకోండి



పార్టీ బలోపేతానికి ప్రతి పంచాయతీని చాలెంజ్‌గా తీసుకోవడం ద్వారా మెజార్టీని సాధించగలం. పార్టీ అప్పగించిన బాధ్యతను కిందస్థాయి వరకు తీసుకుకెళ్లి పని చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించిన చంద్రబాబును ప్రజా కోర్టులో నిలబెట్టాలి. మోసగాడు, దగాకోరు, రాష్ట్రాన్ని లూటీ చేసిన చంద్రబాబును ప్రజలు తరిమికొట్టే రోజు దగ్గర్లోనే ఉంది. మీ అందరూ నిలబెట్టిన కార్యకర్తను నేను. మీ అందరి కృషి ఫలితంగానే పార్టీ ఎటువంటి కార్యక్రమం చేపట్టాలని ఆదేశించినా జిల్లాలోనే టెక్కలిలో అద్భుతంగా నిర్వహిస్తూ పార్టీ పెద్దల మన్ననలను పొందాం. ఈనెల 21 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు ప్రతి కార్యకర్త గ్రామాల్లోకి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి. గోవిందపురంలోని గ్రావెల్ కొండకు సంబంధించి మండపాక నర్సింగరావుకు అన్ని అనుమతులు ఉన్నా మంత్రి అచ్చెన్నాయుడు గ్రావెల్‌ను దౌర్జన్యంగా దోచుకుంటున్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే లేదు. ఎదురు తిరిగితే జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారు. కొండలను మింగిన కింజరాపు కుటుంబీకులు జైలుకు వెళ్లడం తథ్యం. వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు చేయకుండా అడ్డుకుంటున్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మంత్రి అచ్చెన్నాయుడు కనుసన్నుల్లో పని చేస్తుంది. తప్పు చేసిన ఏ అధికారిని భవిష్యత్‌లో వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు తమ నిధులను ఖర్చు చేయనివ్వకుండా, పారిశుద్ధ్య పనులు చేపట్టకుండా అడ్డుకుంటూ అభివృద్ధి నిరోధకుడుగా మంత్రి తయారయ్యారు. వీరందనీ జగన్‌మోహన్‌రెడ్డి దగ్గరికి తీసుకెళ్లి జరిగిన అన్యాయాలను వివరిస్తాం. ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారు. పింఛన్‌దారులు ఎవరు భయపడవద్దు. కోర్టుకు వెళ్లి మీకు న్యాయం చేస్తా.

–పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి

క్లుప్తంగా

అప్రమత్తతే ఆయుధం



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శక్తిటీం పోలీసులు

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, రమ్మీ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ శక్తి టీం ఎస్‌ఐ రవికుమార్ అన్నారు. పూండిలోని వివేకానంద విద్యా సంస్థల్లో విద్యార్థులకు శక్తి యాప్ ఉపయోగాలు, వినియోగించే విధానం తదితర అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రధానంగా ఓటీపీల ద్వారా జరుగుతున్న మోసాలపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు సెల్ వినియోగంపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. విద్యా సంస్థల డైరెక్టర్ పి.సోమేశ్వరరావు, ప్రిన్సిపాల్ డి.వనజనాభం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి: ఖాతాదారులకు మెరుగైన ఆర్థిక సేవలు అందజేయడానికి ఏర్పాటు చేసిన యూకో బ్యాంకు ద్వారా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జోనల్ మేనేజర్ ఎస్.శర్వానన్ కోరారు. టెక్కలి పాలకేంద్రం ఎదురుగా తొలుసూరుపల్లి రోడ్‌లో ఏర్పాటు చేసిన యూకో బ్యాంక్ బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వర్తకులు, వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక సేవలన్నీ అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి.ఆదిత్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువతరం సేవా సమితి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు: ఉద్యానం గోపినాథపురం గ్రామానికి చెందిన పుచ్చ కాంతారావు గుండె నొప్పితో బాధపడుతున్నాడు. అతనికి అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించడంతో దాతల సహాయం కోసం అర్థించారు. పూండి కేంద్రంగా ఉన్న యువతరం సేవా సమితి స్పందించింది. 15 వేల రూపాయలు సేకరించింది. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేసి అండగా నిలిచారు. సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, ప్రతినిధులు ఎ.లక్ష్మణరావు, జి.పుష్పలత, కర్ని నారాయణరావు, మోహనరావు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

సోంపేట: సోంపేట పట్టణంలోని చౌడేశ్వరి కళ్యాణ మండపంలో ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సోంపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమంలో భాగంగా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, సర్పంచ్‌లు తడక జోగారావు, బట్టి మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, పార్టీ నాయకులు రౌతు విశ్వనాథం, బతకల మోహనరావు, పిన్నింటి రేఖారావు, జక్కం రమేష్, పొందూరు సిర్మా, బంగారు గిరిష్, కింతలి భీమా, తోట డిల్లీ, తేజా పట్నాయక్, తెల్లి వైకుంఠరావు, కొట్ని శ్రీనివాసరావు, నెహ్రూ, బతకల సతీష్, కవిరాజు, గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

బాబు మోసాలను ప్రజలకు వివరించండి

నందిగాం: మోసపూరిత, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన చంద్రబాబు, కూటమి ప్రభుత్వ మోసాలను గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పంచాయతీ ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. పార్టీ నాయకులు రెండు కమిటీలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో పర్యటించేందుకు తీసుకోవల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి యర్ర చక్రవర్తి, పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు పాల్గొన్నారు.



పంచాయతీ ఇన్‌చార్జిలకు సూచనలు చేస్తున్న తిలక్

పీఏసీఎస్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కంచిలి: స్థానిక పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం కార్యాలయం ఆవరణలో శుక్రవారం జరిగింది. అధ్యక్షునిగా పైల పురుషోత్తం రెడ్డి, డైరెక్టర్లుగా కిషోర్‌పాఢి, డొక్కర మహాలక్ష్మిలను ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు దుశ్శాలువలతో సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాదిన రామారావు, నాయకులు బంగారు కురయ్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడుగా పెదిని బాబ్జీ, డైరెక్టర్లుగా గిన్ని బాలరాజు, బాసి భారతి ప్రమాణం చేశారు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీ బిరుసువాడ రెవెన్యూ పరిధిలో కొత్త బంద చెరువు ఆక్రమణలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బి.అప్పలస్వామికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చెరువును ఆధారంగా చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని.. అయితే చెరువుకు నీరు రాకుండా ఆక్రమణ చేసి గట్టులు, పునాదులను కొంతమంది నిర్మిస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రైతులు తోట డిల్లీరావు, ఎం.చిన్నారావు, దూగాన ముకుందరావు, దేవాడ పాట్టెమ్మ ఉన్నారు.

సినీనటుడు చిత్రం శ్రీనుకు సత్కారం

కాశీబుగ్గ: పలాస పరిసర ప్రాంతాలలో జరుగుతున్న ఓ సినిమా షూట్‌కు సినీ నటుడు చిత్రం శ్రీను వచ్చారు. ఈ సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడోవార్డు చినబడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది ఆయన్ను శుక్రవారం పాఠశాలకు ఆహ్వానించి ప్రధానోపాధ్యాయిని చింతాడ ఉషారాణి, ఉపాధ్యాయ బృందం చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటులు అమ్మ రామక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీనును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మంజూరు పుస్తకావిష్కరణ

మందస: హరిపురం గ్రామంలోని శాతవాహన డిగ్రీ కళాశాల ప్రాంగణంలో చిక్కోలు ఉద్దానం జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దుప్పల రవికుమార్ సంకలనం చేసిన 'మంజూరు'పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ కవి నల్లి ధర్మారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో 260 మంది కవులు ఈ పుస్తకంలో కవితలు రాసి సామాజిక చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగించారన్నారు. కవుల నుంచి కవితలు సేకరించి పుస్తకాన్ని ముద్రించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులు రవికూమార్ అభినందనీయులయ్యారు. మామిడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు, రచయితలు, గాయకులు, ఉపాధ్యాయులు కె.కృష్ణమూర్తి, కుమార్ నాయక్, వినోద్, పి.రాజేంద్ర, ఎం.గణపతి, జి.లోకేశ్వరరావు, ధనరాజు, రామారావు, నారాయణ, రుద్రయ్య, మజ్జి భాస్కరరావు, దుదిష్టి నాయుడు, శివ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

సోంపేట: పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ కోసం అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బారువ ఎస్సై హరిబాబు నాయుడు అన్నారు. జీడిపుట్టుగ గ్రామంలో శక్తియాప్ గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ కోసం పోలీస్‌శాఖ కొత్తగా శక్తియాప్ అందుబాటులోకి తీసుకొచ్చిందని..దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంప్యూటర్ కాటాకు బ్లూటూత్ కనెక్షన్

ఇచ్ఛాపురం రూరల్: లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించే సమయంలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా కంప్యూటర్ కటాకు బ్లూటూత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇచ్ఛాపురం సీఎస్‌డీటీ కె.సంతోష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ప్రతీ నెల 21 నుంచి నెలాఖరు వరకు 65 ఏళ్లు దాటిన వృద్ధుల ఇళ్ల వద్దకు డీలర్లు వెళ్లి రేషన్ సరుకులు అందించాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శరత్‌బాబు శుక్రవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కార్మికుల విధుల బహిష్కరణ

ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు విధులు బహిష్కరిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.రమేష్ పట్నాయక్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. సంఘ నాయకులు గంగాధర్‌రథో, మంగళ సత్తు, శంకర్, హరి పాల్గొన్నారు.

'నూతన టెక్నాలజీతో కాలుష్యాన్ని నివారించండి'

కాశీబుగ్గ: అత్యాధునిక టెక్నాలజీతో కాలుష్యాన్ని నివారించాలని జీడి వ్యాపారులకు కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య సూచించారు. పలాస కాష్యూ అసోసియేషన్ భవనంలో శుక్రవారం జీడి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి జీడి పరిశ్రమ బాయిలింగ్ విధానంలోకి రావడంతో పలు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నివారించేందుకు ఎప్పటికప్పుడు నూతనంగా వస్తున్న టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు.జీడిపప్పు విక్రయించడమే కాకుండా చెక్కీలు వంటి వివిధ రకాల తినుబండారాలుగా విక్రయాలు చేపడితే మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. కాలుష్య మండలి ఈఈ కారుణ్యశ్రీ, జీడి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బెల్లాల నారాయణరావు, తగ్గాన రమేష్, శాసనపురి మురళి, మల్లా భాస్కరరావు, మల్లా రామేశ్వరరావు, మల్లా సురేష్ పాల్గొన్నారు.

ఒడియా పాఠ్య పుస్తకాలు పంపిణీ



కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రాణో చేతులమీదుగా రెడినెస్ కార్యాచరణ ఒడియా మాధ్యమం పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలోని ముండ్ల, డీజీ పురం, సువాగడ, జలంత్రకోట, బొగాబెణి, కొనక పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వీటిని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్‌పాఢి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి పాల్గొన్నారు. –కంచిలి

సచివాలయాలు ఖాళీ!



ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. శుక్రవారం ఈదుపురం1, 2 గ్రామ సచివాలయాల్లో జూనియర్ అసిస్టెంట్ నాగరాజు మినహాయించి ఒక్క ఉద్యోగి కూడా విధులకు హాజరు కాకపోవడంతో గ్రామ సచివాలయాలకు వచ్చిన లబ్ధిదారులు వెనుదిరిగారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి విజయకుమారి వద్ద ప్రస్తావించగా.. తాను తేలుకుంచి గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జి కావడంతో అక్కడ ఉన్నానని, సచివాలయ ఉద్యోగులు బదిలీ కౌన్సెలింగ్‌లో ఉండగా, సిస్టం రిపేరు కావడంతో ఒక ఉద్యోగి బరంపురం వెళ్లినట్లు తెలిపారు. –ఇచ్ఛాపురం రూరల్

మొక్కలు నాటివేత



కాశీబుగ్గలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షిక పర్యావరణ కార్యక్రమాల్లో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ పి.మధు, ఐక్యూస్ కోఆర్డినేటర్ పి.వి.రమణ, సైన్స్ విభాగాధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు. –కాశీబుగ్గ